పురంలో తాగునీటికి కటకట

- 20 రోజులుగా పలు ప్రాంతాల్లో సరఫరాకాని నీళ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

హిందూపురం: తాగునీటి కోసం పురం వాసులు అల్లాడి పోతున్నారు. 20 రోజులుగా వివిధ ప్రాంతాల్లో నీటి సరఫరా జరగకపోవడంతో నీటికోసం అష్టకష్టాలు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

పట్టణంలో 38 వార్డులు

హిందూపురం పట్టణంలోని 38 వార్డులో దాదాపు సగం వార్డుల్లో గత రెండు నెలల నుంచి తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా హస్నాబాద్, ముక్కిడిపేట, రహమత్‌పురం, బోయ పేట, ముద్దిరెడ్డిపల్లి, ఆర్టీసీ కాలనీ, మేళాపురం తదితర ప్రాంతాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. కుళాయిలకు సక్రమంగా నీరు వదలడం లేదని 15, 20 రోజులకోసారి నీళ్లు వదులుతున్నారని ప్రజలు వాపోతున్నారు.


ఆజాద్‌పేటలో ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న స్థానికులు

నీటి పంపింగ్‌లో సమస్యలు

పట్టణంలో దాదాపు 2 లక్షలు జనాభా ఉంది. ప్రతిరోజు సుమారు 18 ఎంఎల్‌డీ నీరు అవసరం అవుతుంది. మున్సిపాల్టీకి ప్రధాన నీటి సరఫరా కేంద్రం గొల్లపల్లి నుంచి రోజూ 12 ఎంఎల్‌డీ వరకూ నీటి సరఫరా జరుగుతుంది. అలాగే పట్టణంలోని వందబోర్ల నుంచి పంపింగ్ జరుగుతోంది. అయితే గత నాలుగైదు నెలల నుంచి గొల్లపల్లి పంపింగ్ కేంద్రంలో ఒకే ప్రధాన మోటార్ పంపింగ్‌లో సమస్యల కారణంగా అవసరమైన నీటి పంపింగ్ చేయలేకపోతున్నామని అధికారుల చెబుతున్నారు. రెండురోజులుగా ఎస్‌కేడీ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడం, కాయల్స్, వైరింగ్ సమస్యలతో పట్టణంలోని అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా చేయపోతున్నామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. వెంటనే మరమ్మతు పూర్తి చేసి నీటిని సరఫరా చేస్తామంటున్నారు. అలాగే గొల్లపల్లి వద్ద నీటి పంపింగ్ కోసం మూడు మోటర్లు ఉండగా.. అందులో ఒక్క మోటారు ద్వారానే పంపింగ్ జరుగుతోందని, మిగిలిన రెండు మరమ్మతు చేయిస్తే వేసవికాలంలో నీటి పంపింగ్ కొరత ఉండదని అధికారులు చెబుతున్నారు.

రెండు రోజుల్లో అన్ని ప్రాంతాలకూ నీళ్లు

హిందూపురం మున్సిపాల్టీకి నీటి సరఫరా చేసే ఎస్‌కేడీ పంపింగ్ స్టేషన్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్, కేబుల్, కాయల్స్ కాలిపోవడంతో సమస్య వచ్చింది. వాటికి వెంటనే మరమ్మతు చేసి పంపింగ్ ప్రారంభించాము. మరో రెండు రోజుల్లో అన్ని ప్రాంతాలకూ యథావిధిగా నీటిసరఫరా చేస్తాం. అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయిస్తున్నాం. ఇందుకోసం నాలుగు మున్సిపాల్టీ ట్యాంకర్లు, ఐదు ప్రైవేటు ట్యాంకర్లను వినియోగిస్తున్నాము.

– విశ్వనాథ్, మున్సిపల్ ఎంఈ, హిందూపురం

సస్యరక్షణతోనే అధిక దిగుబడి


గుండుమలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించిన దృశ్యం


గుడిబండ: కంది పంటను పరిశీలిస్తున్న ఏఓ వీరనరేష్

మడకశిరరూరల్: మండల పరిధిలోని రైతులు పంట సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని ఏఓ తిమ్మప్ప తెలిపారు. మంగళవారం గుండుమల, కదిరేపల్లి పంచాయతీల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. పొలాల్లో పర్యటించి రాగి, కంది, మొక్కజొన్న, వేరుశనగ పంటను పరిశీలించారు. అనంతరం పలు సలహాలు, సూచనలిచ్చరు.

అమరాపురం: మండలంలోని హేమావతి గ్రామంలో వ్యవసాయాధికారి మంజునాథ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలాలను దుక్కి చేసే ముందు భూసార పరీక్షలను చేయించుకుని తరువాత పంటలు సాగు చేయాలన్నారు. తెగుళ్ల నివారణకు సస్య రక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

గుడిబండ: పంటసాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడి సాధించాలని ఏఓ వీర నరేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దేవరహట్టి రైతు సేవా కేంద్రం ఆవరణలో ఏఓ వీరనరేష్, సిరికల్చర్ అధికారిణి సరోజిని తదితరులు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవరహట్టి రైతు సేవ కేంద్రం పరిధిలోని పంట పొలాలను సందర్శించి రైతులకు సూచనలు, సలహాలిచ్చారు.

చౌళూరు రామకృష్ణారెడ్డికి ఘన నివాళి


రామకృష్ణారెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

హిందూపురం: పేదల అభ్యున్నతికి పాటుపడిన దివంగత వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చౌళూరు రామకృష్ణారెడ్డి వందలాది మంది అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. చౌళూరు రామకృష్ణారెడ్డి రెండో వర్ధంతి మంగళవారం హిందూపురం మండలం చౌళూరులో కుటుంబ సభ్యులు, పార్టీ అభిమానుల మధ్య జరిగింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రజలు, నాయకులు రామకృష్ణారెడ్డి సమాధి వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చౌళూరు రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు నారాయణమ్మ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకురాలు మధుమతి రెడ్డి, రామకృష్ణారెడ్డి సతీమణి జ్యోత్స్న, తనయుడు తషన్‌రెడ్డి, ఎంపీపీ రత్నమ్మ, లేపాక్షి వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, ఎంపీటీసీ కృష్ణవేణి, రామక్రిష్ణరెడ్డి, సర్పంచ్ నంజప్ప, మాజీ సర్పంచ్ రాజు, తిమ్మా రెడ్డి, రంగనాథ్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయండి


పోస్టర్లను విడుదల చేస్తున్న తహసీల్దార్ వరదరాజు

పావగడ: తుమకూరు పట్టణంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో పావగడ తాలూకా ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని తహసీల్దార్ వరదరాజు విజ్ఞప్తి చేశారు. స్థానిక తాలూకా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటిసారిగా తుమకూరులో జిల్లా అధికారుల నేతృత్వంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో ధార్మిక ఉత్సవాలు, నవరాత్రి ఉత్సవం, దుర్గాదేవి పూజలతో పాటు అమ్మవారిని రోజూ విశేషంగా అలంకరిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలాది మంది కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నట్లు పేర్కొన్నారు. 11న కరునాడ చక్రవర్తి డా శివరాజ్ కుమార్ , ప్రముఖ సంగీత దర్శకుడు గురుకిరణ్ తదితర గాయనీ గాయకులతో సంగీత విభావరి ఉంటుందన్నారు. ఈఓ జానకీరాం, మున్సిపల్ ముఖ్యాధికారి జాఫర్ షరీఫ్, ఆర్ఐ రాజగోపాల్, వ్యవసాయశాఖ ఏడీ అజయ్ కుమార్, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండుగ వేళా పచ్చడి మెతుకులే..

- రేషన్ షాపులో కందిపప్పు బంద్


మార్కెట్‌లో అమ్మకానికి ఉంచిన కందిపప్పు

హిందూపురం: దసరా పర్వదినాన కూడా పేదలు పప్పన్నం కూడా తినే అదృష్టానికి నోచుకోలేదు. ఈ అక్టోబరు మాసం నుంచి కందిపప్పును రేషన్ కార్డు దారులకు సరఫరా చేస్తామని ఇచ్చిన హామీ కూడా నీటిమీద రాతగానే మారింది. రేషన్ షాప్‌లో కేవలం ఎప్పటిలాగే బియ్యం, పంచదార సరఫరా చేసి చేతులు దులుపుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టినప్పటి నుంచి నేటి వరకు చెప్పిన హామీ ఇక్కటి కూడా నెరవేర్చలేదని ప్రజలు వాపోతున్నారు.

బయట మార్కెట్‌లో షాక్ ఇస్తున్న రేట్లు

రేషన్ షాపుల్లో కందిపప్పు అడిగితే సమాధానం చెప్పే దిక్కు లేకుండా పోయింది. ప్రభుత్వం ఇవ్వలేదు తాము ఎక్కడి నుంచి ఇస్తామని డీలర్లు అసహనంగా చెబుతున్నారు. బయట మార్కెట్లో కందిపప్పు కొని పండుగ జరుపుకుందాం అనుకున్న వారికి ధరలు షాక్ ఇస్తున్నాయి. కిలో కంది పప్పు బయట మార్కెట్లో రూ.140 నుంచి రూ.150 దాకా పలుకుతున్నాయి. రేషన్ షాపుల ద్వారా కిలో రూ.60 రూపాయలకే లభించే కందిపప్పుకు అదనంగా రూ.100 వెచ్చించాలంటే కొనలేకపోతున్నామని సామాన్య ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈఏడాది దసరా పండుగ భారంగా మారుతోందని చెబుతున్నారు. అధికారులు కూడా పేదల పరిస్థితి పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. కలెక్టర్ చొరవ తీసుకొని పండుగ వేళ రేషన్ షాపుల ద్వారా కందిపప్పు, చక్కెర, నిత్యాసర వస్తువులు సరఫరాకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

దుప్పట్లు, దోమతెరల పంపిణీ


వృద్ధాశ్రమంలో దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

హిందూపురం: బీఐటీ కళాశాల చైర్మన్ చంద్రమోహన్ పుట్టినరోజును పురస్కరించుకుని కళాశాల విద్యార్థులు మంగళవారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో కళాశాలలో చైర్మన్ చంద్రమోహన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని రూపశ్రీ, వెంకటేశ్వర, వృద్ధాశ్రమాలు, సత్యసాయి ప్రేమ్‌సాధన్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో దుప్పట్లు, దోమతెరలు, నిత్యావసరాలు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

13న అమ్మాజీ జాతర


జీరిగేపల్లిలో వెలసిన అమ్మాజీ దేవతలు

రొళ్ల: మండల పరిధిలోని జీరిగేపల్లిలో త్రిశక్తి దేవతలుగా విరజిల్లుతున్న మారక్క, గ్యారక్క, ముదుపక్క అమ్మాజీ దేవతల జాతరను ఈనెల 13 (ఆదివారం)న అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి ఏడాది దసర శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ఉత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఉత్సవ వేడుకలకు నియోజకవర్గ వ్యాప్తంగా కాకుండా అమ్మవారిని కొలిచే కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో స్థిరపడిన వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారన్నారు. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామని, దాతల సహకారంతో అన్నదానం కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

రైతులకు భూములివ్వండి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

పావగడ: తాలూకా వ్యాప్తంగా భూముల్లేని రైతులకు భూములివ్వాలని స్థానిక బీపీఎస్ (భారతీయ పరివర్తన సంఘం) నాయకులు మంగళవారం స్థానిక తాలూకా కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీఎస్ రాజ్యాధ్యక్షుడు హరిరామ్ మాట్లాడుతూ తాలూకాలోని వివిధ గ్రామాలలో భూములు లేని రైతులు కూలీ పనులు చేస్తూ పొట్టనింపు కుంటున్నారన్నారు. చెమటోడ్చి పని చేసే రైతులకు భూములివ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో వ్యవసాయం చేస్తున్న వారికి సాగు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ వరదరాజుకు వినతి పత్రం అందించారు. అంతకు ముందు బీపీఎస్ నాయకులు, రైతులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నాయకులు కెంచరాయ, హెచ్‌డీ ఈరణ్ణ, హనుమంతరాయప్ప, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు పనులు కల్పించండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ రామారావు

అమరాపురం: మండలంలో ఉపాధి హామీ పథకం కింద కూలీలకు వందశాతం పనులు కల్పించాలని ఎంపీడీఓ రామారావు అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడిగిన ప్రతి కూలీకి పనులు కల్పించాలన్నారు. అలాగే గత వారంలో జరిగిన పనుల రికార్డుల పరిశీలించారు. గ్రామాల్లో కూలీలకు అవగాహన కల్పించి పనులకు వచ్చేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత 'కోతులగుట్ట'


విజేతగా నిలిచిన కోతులగుట్ట జట్టు

మడకశిరరూరల్: విజయదశమి సందర్భంగా మండల పరిధిలోని కోతులగుట్ట గ్రామంలో యువకుల ఆధ్వర్యంలో అండర్–15 క్రికెట్ పోటీలు నిర్వహించారు. మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కోతులగుట్ట జట్టు – సిద్ధగిరి జట్లు తలపడ్డాయి. కోతులగుట్ట జట్టు విజయం సాధించగా నిర్వాహకులు ట్రోఫీ అందజేశారు.

మాదిగలు అన్ని రంగాల్లో బలోపేతం కావాలి

పెనుకొండ: మాదిగలు అన్ని రంగాల్లో బలోపేతం కావాలని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్లో జిల్లాకు చెందిన పలువురు మాదిగ హక్కుల పరిరక్షణ సమితి నాయకులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ మాదిగలు విద్య, ఆర్థిక, సామాజిక అంశాలలో బలోపేతం కావాలని సూచించారు. నిరుద్యోగులుగా మిగలకుండా ప్రతి ఒక్కరూ ఏదో ఒక ఉద్యోగం పొందే ప్రయత్నం చేయాలన్నారు. కాలయాపన చేయడం ద్వారా కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. స్థానిక సమస్యలపై మాదిగలు దృష్టి నిలపాలన్నారు. నాయకులు ఆనంద్‌కుమార్, రామతీర్థ, నాగన్న, రామాంజినేయులు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 10న ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ, ప్రిన్సిపాల్ కేశవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూలకు మూడు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా చదివిన నిరుద్యోగులు సర్టిఫికెట్లలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. ఎన్నికైన వారికి రూ.12 వేల నుంచి 18 వేల వేతనం ఉంటుందన్నారు. పెనుకొండ, బెంగళూరు, మంగళూరులో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని చెప్పారు.

చేపల చెరువు వేలం

అగళి: మండల పరిధిలోని కొమరేపల్లి గ్రామ పంచాయతీలోని రావుడి చెరువులో చేపల పెంపకానికి ఈఓఆర్డీ పద్మ, సర్పంచ్ సుజాత ఆధ్వర్యంలో చెరువుకట్ట రావుడి ఆంజనేయస్వామి గుడి దగ్గర వేలం పాటను పంచాయతీ కార్యదర్శి రమ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. వేలంపాటలో అందరికన్నా ఎక్కువ పాడి మాజీ సర్పంచ్ తిప్పేస్వామి రూ.70 వేలకు వేలంపాట దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

పెనుకొండ: సత్యసాయి బాబా పాఠశాలకు చెందిన పలువురు పూర్వ విద్యార్థుల సహకారంతో స్థానిక హెచ్ఎంటీ కాలనీలో సత్యసాయి బాబా ఆలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. పుట్టపర్తికి చెందిన పలువురు వైద్యులు క్యాన్సర్, లివర్, కిడ్నీ, పక్షపాతం తదితర దీర్ఘకాలిక రోగాలకు చికిత్స అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అత్యవసర వైద్యం అవసరమున్న వారిని పుట్టపర్తికి తరలించారు. ఉన్నత వైద్యం అందించి అనంతరం వారిని గ్రామాలకు పంపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి నెలా ఈ ఉచిత వైద్య సేవలు అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు.

కందిపంటపై అవగాహన


కంది పంట సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోరంట్ల: మండల పరిధిలోని పాలసముద్రం గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల రైతులకు మంగళవారం కందిపంటపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా మండల వ్యవసాయ అధికారి మునికృష్ణ పలు సూచనలు, సలహాలిచ్చారు. కంది పంటకు సోకుతున్న తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ, పట్టుపరిశ్రమ అధికారులు, ఆర్‌బీకే సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

రంగనాథ స్వామికి పూజలు


అలంకరణలో రంగనాథస్వామి

అగళి: దసర నవరాత్రుల సందర్భంగా మండల పరిధిలోని నరసంబుదిలో లక్ష్మీ రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం వేకువ జామునే అభిషేకాలు, అర్చనలు, విశేష అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

వర్షానికి కూలిన ఇళ్లు


ఇరిగేపల్లిలో వర్షానికి కూలిన ఇంటి పైకప్పు

అగళి: మండల కేంద్రంలో మూడు రోజుల కురుస్తున్న వర్షాలకు జన జీవనం స్తంభించింది. సోమవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. మండల పరిధిలోని ఇరిగేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన లలితమ్మ ఇల్లు కూలిపోయింది. అలాగే నందరాజనపల్లిలో గొల్ల తిమ్మక్కకు చెందిన ఇంటి పైకప్పు కూలింది. ఇద్దరి కుటుంబాలకు మగా వాళ్లు దిక్కులేకపోవడంతో ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చౌడేశ్వరిదేవీ నమోస్తుతే !

శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ఆలయాల్లో మంగళవారం అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివెళ్లి మొక్కలు తీర్చుకున్నారు.

– సాక్షిబృందం


అమరాపురం: అలంకరణలో చోళమాంబదేవి


గుడిబండ: ధనలక్ష్మిగా దర్శనమిస్తున్న తుమ్మల మారెమ్మ


మడకశిర: పత్తి అలంకరణలో వీరకేతమ్మ


పెనుకొండ: గాయత్రీదేవి అలంకరణతో మహేశ్వరి


చిలమత్తూరు: చండీమాతగా దర్శనమిస్తున్న చౌడేశ్వరిదేవి


రొద్దం: శ్రీమహాలక్ష్మి అలంకరణలో రేణుకా యల్లమ్మ


రొళ్ల: సరస్వతీదేవిగా కొల్హాపురి మహాలక్ష్మీదేవి


పెనుకొండ: వారాహిదేవిగా వాసవీ మాత


హిందూపురం: విద్యగోపాలుడిగా దర్శనమిస్తున్న పేట వెంకటరమణస్వామి


హిందూపురం: ద్రాక్షల అలంకరణలో జలదుర్గమ్మ